# మనసుకో దాహం

'నే కమల నయనని కాబట్టి ఇంట్లోకి రావన్నమాట" సింధూర పడమటి వర్ణం చెక్కిలిపై చిందులేస్తుండగా తీసిన తలుపుకి కాస్త చేరబడి చిర్నవ్వుతో అడుగుతున్న ఆమెని ఏదో విచిత్రాన్ని చూస్తున్నట్టు ఆశ్చర్యంతో కనురెప్పలు విప్పార్చుకుని తలుపుకి ఇవతలే నిలబడిపోయాడు చంద్ర.

'లోపలికి రావా?' అధరాలు బిగించి, కళ్లలోనే చిలిపితనాన్ని దాచేసి చాలా క్యాజువల్‌గా అడిగిందామె. ఆశ్చర్యం నుండి తేరుకుంటూ 'ఇ.... ది... వి...జయ్ ఇల్లు కాదా?" అడిగాడతను.

"అవును"

"ఈ ఇంట్లో నువ్వా?"

"ఇంటి ఇల్లాలినోయ్" చిర్నవ్వుతో అందామె.

'నిజమా?'

'అగ్నిసాక్షిగా'

చంద్ర ఇంట్లోకి అడుగుపెట్టాడు. సోఫాలో కూర్చున్నాడు.

"మంచినీళ్లు ... కాఫీ ... టీ" అడిగిందామె.

"ఇప్పుడేం వొద్దు" మొహమాటంగా అన్నాడతను.

'నేచేసే కాఫీ నీకిష్టంగా" అని ఆగి 'విజయ్ యూనివర్సిటీకి వెళ్లారు. ఓ గంటలో రావొచ్చు. నువ్వొస్తే కూర్చోమన్నారు' అని వంటింట్లోకి వెళ్లిందామె.

విజయ్ కమలనయన భర్తా?

ఇదెలా సాధ్యం?

ఆమె చెప్పిందే సత్యమైతే ఆ అధరాలపై చిర్నవ్వు అంత స్వచ్ఛంగా, అంత

ఆర్ద్రంగా అంతలా మెరుస్తూ ఎలా అలా వెలిగిపోతుంది?

ఉహూ కమలనయన నిజం చెప్పటం లేదు.

ఛ. ఛ. భర్తకాని వ్యక్తిని భర్తగా ఎందుకు చెపుతుంది?

ఇది నిజమైతే మరి ఆ రోజులు....

మంచు రేకులు చామంతులని అభిషేకించేవేళ 'వస్తావా?' ఆత్రంగా అడిగాడు చంద్ర.

మెరిసే పెద్ద పెద్ద కళ్లని మరింత విశాలంచేస్తూ 'వస్తే ఏం చూపిస్తావ్?' అడిగింది కమల నయన.

"నల్లని కొండలు నీలి నీలి కెరటాలు - పచ్చపచ్చని కొబ్బరాకులు. తెల్లతెల్లని ఇసుక - రంగు రంగు గవ్వలు. నీకు తెలీదేమో భీమ్లీ అణువణువూ సౌందర్యమే. ఆ గాలి తగిల్తేనే నువ్వు తిరిగి ఈ సింహాచలం రానంటావ్" వూరిస్తూ అన్నాడు చంద్ర.

"ఇంకా ఏం చూపిస్తావ్?" జడలో సంపెంగలు పెట్టుకుంటూ అడిగిందామె.

"ఇంకా... ఇంకా... ఆ నర్సింహస్వామి కొండ, ఘంటస్తంభం, ట్రైనింగ్ స్కూల్, సరుగుడు తోటలు, మట్టిదిబ్బలు" అన్నాడతను.

"ఇంకా?"

"జాలారిపేట, వుప్పరివీధి, లైట్ హౌస్" చికాకుగా అన్నాడతను. 'అంతే?' చాలా తేలిగ్గా అంటున్న ఆమెని కోపంగా చూస్తూ "రావటం ఇష్టం లేకపోతే రానని చెప్పచ్చుగా? ఎందుకిలా వాగించటం? భీమ్లీలో సముద్రం కంటే చూడాల్సినవేం ఉంటాయ్?" అన్నాడతను.

సంపెంగ సౌరభాన్ని గుండెల నిండుగా దాచుకుంటూ "చలం గారిల్లు" అందామె.

సింహాచలం సంపెంగ సౌరభంలా గుండెల్లో గుభాళించే ఆమె సామీప్యపు సుగంధం, ఇదిగో, ఇటువంటి కోరికలు విన్నప్పుడు ఆవిరైపోయి సన్నసన్నని సెగలు గుండెల్లో గుబులు పుట్టిస్తుంటాయ్.

అంతవరకూ సముద్రపు ఒడ్డున రంగురంగు గవ్వలు ఏరి ఓ సౌధం నిర్మించి అందులో మరువపు పరుపులుపరిచి ఆమె ఒడిలో తలవాల్చి అల్లిబిల్లి కొబ్బరాకుల నీడల్లోంచి వెన్నెలకి కన్నుకొట్టాలనే వూహలన్నీ వెలిగించని కర్పూరంలా ఆవిరైపోతాయ్.

ఏడాది క్రితం కమలనయన తండ్రికి బదిలీ అయి సింహాచలం వచ్చారు. రెండు పోర్షన్ల ఇంట్లో, ఒక పోర్షన్ ఇంటిగలవాళ్లు, మరో పోర్షన్లో కమలనయన వాళ్లుండేవారు. ఆ ఇంటి మేడపై ఓ గదిలో చంద్ర అద్దెకి ఉండేవాడు. అతడి తల్లిదండ్రులు భీమ్లీలో ఉండేవారు. ఈ వీధిలో నాల్గో ఇంట్లో వుంటున్న భార్గవి,కమలనయన కలిసి కాలేజికి వెళ్లేవారు.

పరికిణీ, ఓణీలో గోదారి కన్యలా కమలనయన, జీన్స్, టీ షర్ట్‌లో భార్గవి కలిసి వెళుతుంటే చంద్రకి చికాకుగా అనిపించేది.

'పరిచయం లేదు. లేకపోతే అసలా భార్గవితోనే మాట్లాడొద్దని చెప్పేవాణ్ణి' అని చాలాసార్లు అనుకున్నాడు.

ఓ ముసురు పట్టిన సాయంత్రం కాలేజ్ నుండి చంద్ర ఇంటికి వచ్చి మేడమెట్లు

ఎక్కుతుంటే "బాబు చంద్రా!" అని వినిపిస్తే తలతిప్పి చూసాడతను.

కమలనయన వాళ్ల అమ్మగారు.

"ఏంటండి?" నమ్రతగా అడిగాడు.

'మీ అమ్మ, నాన్నగారొచ్చారు. మా ఇంట్లో ఉన్నారు' అంటూ ఆమె ఇంట్లోకి ఆహ్వానించింది.

చంద్ర తల్లిదండ్రులు కాఫీ తాగుతున్నారు. చంద్రకి ఓ కప్పు అందించిందామె.

కాఫీ తాగుతూ గదిని పరిశీలిస్తున్న అతడి చూపు ఓచోట ఆశ్చర్యంగా నిలిచిపోయింది.

పుస్తకాలు - నీట్‌గా బీరువాలో సర్దున్నాయి.

"ఆ పుస్తకాలు ఎవరివి?" అడిగాడతను.

"మా కమలనయనవి" చెప్పిందామె.

"మావాడికి పుస్తకాలంటే పిచ్చి" అంది అతడి తల్లి.

అంతలో కమలనయన కాలేజ్‌నుండి వచ్చింది.

తల్లి కమలనయనని పరిచయం చేసిందందరికీ.

"మీరు చదవని పుస్తకాలు తీసుకెళ్లండి" అంది కమలనయన. అప్పటినుండి ఇద్దరూ స్నేహితులైపోయారు.

ఆమె పుస్తకాలని కాలక్షేపం కోసం చదవదు. ప్రతి పుస్తకాన్ని లోతుగా విశ్లేషిస్తుంది. అతడూ చదువుతాడు. కాని క్యాజువల్‌గా!

ఓరోజు ఆమె అతనికి బంగాళదుంప కుర్మా పంపించింది.

"చాలా బాగుంది" అన్నాడతను.

"అమ్మ వూరెళ్లింది. భార్గవి పంపించింది. చాలా ఉందని నీకు పంపించాను" అందామె.

"భార్గవి పంపించిందా?" వికారంగా అడిగాడు తను.

"ఆ"

"ఆ ముఖానికి వంటొక్కటే తక్కువయ్యిందా?"

"ఏం?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"ఆ బట్టలు, జుట్టు, ఛీ నాకు చికాకు. తనకి వంట రావటం ఏంటి?" వింతగా అన్నాడతను.

"భార్గవికి వంట బ్రహ్మాండంగా వచ్చు. నేనేదో చేస్తాను తప్ప ఆమెలా చెయ్యలేను" అందామె.

"ఏం?" చిత్రంగా అతడ్ని చూస్తూ అడిగిందామె.

"చెప్పానుగా ఆ బట్టలు, జుట్టు" రోతగా అన్నాడతను.

"ఎవరి అభిరుచులు, అభిప్రాయాలు వాళ్లవి. ఆమె బట్టలు, జుట్టు నీకు నచ్చినంత మాత్రాన నేనెందుకామెతో మాటలు మానెయ్యాలి?' స్పష్టంగా అడిగిందామె.

చంద్ర ఆమెకేం జవాబు చెప్పలేకపోయాడు.

"ఏంటి అంతలా ఆలోచిస్తున్నావ్?" అడిగిందామె.

"వస్తావా భీమ్లీ" అడిగాడతను.

"రాను" అందామె.

"ఏం?"

"ఇక్కడికి భీమ్లీ ఎంతో దగ్గర. ఎన్నోసార్లు చూడ్డానికి అవకాశం వచ్చింది. అయినా వెళ్లలేదు. ఎందుకంటే అది హనీమూన్ ప్లేస్‌గా రిజర్వ్ చేసుకున్నాను" మెరిసే కళ్లతో చెప్పిందామె.

"నీ పెళ్లి సెటిల్ అయిందా?" అనుమానంగా అడిగాడతను.

"లేదు" అందామె.

అతడొక్కడే భీమ్లీ వెళ్లాడు.

ఆ వేసవిలో తల్లి పెళ్లికూతుర్ల లిస్ట్ చెపుతుంటే అతనికి కమలనయన పదేపదే కళ్లముందు కదిలింది.

ముగ్ధంగా మురిపిస్తూ - వెన్నెలని ఆస్వాదిస్తూ - సాహిత్యం గురించి చర్చిస్తూ భార్యగా - ప్రియతమ భార్యగా అలా అలా కమలనయన అతని కళ్లముందు కదుల్తూ కదుల్తూ "ఎందుకు?" అని ప్రశ్నిస్తూ, "ఏంటి?" అని నిలదీస్తూ... ప్చ్ - కుదర్దు!

కంటికి ఇంపైన అమ్మాయిని భార్యగా నిశ్చయించుకొని తల్లికి చెప్పి బయలుదేరాడు.

★ ★ ★

అతడొచ్చేసరికి కమలనయన ఇంటికి తాళం వేసుంది. రెండ్రోజుల తర్వాత భార్గవి అతడి గదికి వచ్చి "కమలనయన తాతగారికి బాగులేదంట. వాళ్ల వూరెళ్లారు. మీరు రాగానే చెప్పమంది. మీరు బయట కన్పించనేలేదు. అందుకే నేనొచ్చాను" అందామె.

"నే రేపు వూరెళుతున్నాను. కార్డ్సు రాగానే పంపిస్తాను. వీలైతే పెళ్లికి ముందొచ్చి కమలకి చెపుతాను. పెళ్లికి తప్పకుండా రమ్మని చెప్పండి" అన్నాడతను.

"మీ పెళ్లా? ఎవరితో" చప్పున అడిగిందామె.

"ఏం?"

"ఈ విషయం కమలనయనకి తెలుసా?"

"తెలియదు".

"మీకు తనంటే ఇష్టం లేదా?"

"ఏం?" తడబడుతూ అడిగాడు.

"తనకి ఇంట్లో సంబంధాలు చూస్తుంటే అప్పుడే పెళ్లి చేసుకోనని చెపుతుంది. నే పొరపాటు పడకపోతే మీరు తనని ప్రేమిస్తున్నారని, పెళ్లి చేసుకుంటారని ఆమె భావిస్తుంది" అంది భార్గవి.

అతని తల గిర్‌గిర్రన తిరగసాగింది. తను ఆమెని ప్రేమించాడు. పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. పెళ్లి, ప్రేమ అంటూ ఆమె దగ్గర డైరెక్ట్‌గా మాట్లాడలేదు. కాని ఆమెని

చూడాలనే తహతహ, ఆమెతో ప్రతిక్షణం పంచుకోవాలనే తలంపు, కళ్లల్లో సంతోషం ఇవన్నీ నిజమేగా?

ఆమె వద్దనుకొని మరో 'యువతిని వివాహం చేసుకోవటంలో ఆంతర్యం ఏమిటి చంద్రా?' అతడి మనసుకి అతడే జవాబుదారి.

అంతే అప్పటికప్పుడు గది ఖాళీ చేసేసాడు. స్థిరపర్చుకున్న వివాహాన్ని రద్దు చేయలేక, చెయ్యాలనే తలంపు లేక, కమలనయనని భార్యగా ఆమోదించే హృదయం లేక.

ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు కమలనయన ఇక్కడ ఇలా ఎదురవ్వటం మాగాణి నేలపై ఖర్జూరపు వనంలా వింతగా ఉందతనికి.

"ఇదిగో కాఫీ" అంటూ అందించిందామె.

"ఎలా వున్నావ్?" అడిగాడతను.

"కమలనయనలా" నవ్వుతూ అందామె.

"నీగురించి చెప్పు" అతని ఎదురుగా కూర్చుంటూ అడిగిందామె.

"నువ్వింత సంతోషంగా ఎలా ఉన్నావ్?" తెగించి అడిగేసాడు.

"ఏం నువ్వు లేవా?" చిత్రంగా అడిగిందామె.

"నే పెళ్లిచేసుకున్న నందినికీ నాకూ ఏ విషయంలోనూ కలవదు. ఆమెకి పుస్తకాలు చదివే అలవాటు లేదు! సినిమాల పిచ్చి! స్టీల్ సామానంటే మోజు! వారానికి నాలుగు రోజులు ఉపవాసం ఉంటుంది. ఆ భక్తికి అంతుండదు! నీకు తెల్సుగా నాకు దేముడిపై నమ్మకం లేదని! నేనెంత పిచ్చి నిర్ణయం తీసుకున్నానో ప్రతి వెన్నెలరాత్రి, వేసవిగాలి నాకు చెప్తుంటాయ్" భారంగా అన్నాడతను.

ఆమె మౌనంగా ఉండిపోయింది.

"నిజం కమలా! నిన్ను చేసుకొని ఉంటే జీవితం ఇలా యాంత్రికంగా ఉండకపోనని చాలాసార్లు అనుకునేవాణ్ణి. అభిరుచులు కలవకుండా పెళ్లి చేసుకోకూడదు" భారంగా అన్నాడతను.

"ఆమె నిన్ను దేనికైనా సతాయిస్తుందా?" అడిగిందామె.

"అటువంటిదేం లేదు. కాని ఏదో అసంతృప్తి" అన్నాడతను.

"ఈమధ్యేం పుస్తకాలు చదివావ్?" అడిగిందామె గదిలో లైట్ వేస్తూ. విద్యుత్ కాంతి పడి చమక్ మని మెరుస్తున్న ఆమె పాపిట్లో సింధూరాన్ని చూస్తూ "పుస్తకాలు చదివి చాలా రోజులైంది" అన్నాడతను.

"కొత్త ప్రదేశాలేం చూశావ్?" అడిగిందామె.

"ఏం చూడలేదు. ఎక్కడికీ వెళ్లాలనిపించటం లేదు" నిరాసక్తంగా అన్నాడతను.

"ఏంటిదంతా? నందినికి ఆసక్తి లేదనే ఇలా డల్‌గా వుంటున్నావా?' చిర్నవ్వుతో అందామె.

"ఆఁ"

ఆ.ప్ర. గ్రంథాలయ... F-10030



ఆమె ఓ క్షణం మౌనంగా ఉండి "చాలా చిత్రంగా మాట్లాడుతున్నావ్ చంద్రా. నేనొచ్చేసరికి గది ఖాళీ చేసేసావ్. భార్గవి నీ వివాహం గురించి చెప్పింది. కాని నీ శుభలేక రాలేదు నాకు. మీ భీమ్లీ ఇంటి ఎడ్రస్ తెలియదు. ఆ తర్వాత కొన్నాళ్లకి విజయ్‌తో నా పెళ్లయింది. పెద్దలు సెటిల్ చేసిందే. విజయ్ సైన్స్ స్టూడెంట్. బీచ్‌కి వెళితే రంగురంగు క్రిస్టల్స్‌పై సూర్యకాంతి వెల్గుల్ని, కొత్త కొత్త రంగుల్ని, అలల విరుపుల్ని చూస్తుంటే ఎంతో ఆహ్లాదంగా వుండేది. విజయ్‌కి వాటి వైబ్రేషన్ లెన్త్, ఫ్రీక్వెన్సీ ఇలాంటివి తోట్టేవి. ఎందుకంటే అతను ఓ సైంటిస్ట్. అతనా విషయాలు నాతో చర్చించలేడు. నేను నా భావాలు అతనికి చెబితే బాల్య స్మృతుల్లా అనిపించేవి. పసితనంలో మట్టి పిడతల్లో ఉత్తుత్తి అన్నం, పప్పు, కాఫీ చేసి ఆడుకోవటం ఎంతమందికి గుర్తుంటుంది? అవే ఆటలు మన పిల్లలు గొప్ప ఆనందంతో ఆడుకుంటుంటే మనం ఓనాడు ఆడేమని మర్చిపోయి ఎందుకాపిచ్చి ఆటలు అనుకోమా?" అని ఆగి "చంద్రా! ఎవరి ఆలోచనలు, భావాలు, ఆదర్శాలు వాళ్ల సొంతం. విజయ్‌కి నేను, నాకు విజయ్ కొత్తగా ఉండం. మేం కలిసి ఉంటున్నాం. సంతోషంగా వుంటున్నాం. పిల్లల్ని పెంచుతున్నాం. కష్టసుఖాలు పంచుకుంటున్నం. నా ప్రకృతి ఆరాధన, సాహిత్యాభిలాష నా సొంతం. అతని పరిశోధన, థీసిస్ అతని సొంతం" అందామె.

"అదే నాబాధ. మన భావాలు కలిసేవాళ్లని పెళ్లి చేసుకోవచ్చుగా. చేసుకోలేకపోయాం" దిగులుగా అన్నాడతను.

మంచు కరుగుతున్నట్టు నవ్వుతూ "నన్నేదో మిస్ అయి జీవితంలో చాలా పోగొట్టుకున్నట్టు బాధపడుతున్నావ్. నీ అభిరుచులు నావి, ఒక్కటి కావచ్చు. కాని ఫ్రీక్వెన్సీలో తేడా వుంది. నిజాయితీగా ఆలోచించు. నువ్వు నన్ను వద్దు అనుకొని మరో యువతిని పెళ్లి చేసుకోడానికి కారణం ఏంటి? నే నిన్ను డామినేట్ చేస్తాననేగా! నన్ను నువ్వు పెళ్లి చేసుకున్నా ఆనందంగా ఉండేవాడివి కాదు. ఇద్దరం చలం గారిని చదివాం. నీకర్థమయిన చలం వేరు. నాకు నచ్చిన చలం వేరు. ఎవరి ఆంతరంగిక ఆనందాలు, ఆహ్లాదాలు వాళ్ల సొంతం. మరో ఆంతరంతో సరితూగటం చాలా చాలా కష్టం. నందిని పుస్తకాలు చదవదు. కాని నిన్ను చదవొద్దందా? కాని నువ్వు చదవటం మానేసావ్. ఎందుకు? ఎండలో ముగ్గురు ప్రయాణిస్తుంటారు. అందరికీ దాహం వేస్తుంది. తాగే నీరు ఒక్కటే క్వాంటిటీ వేరు. జీవితం అంతే" అందామె.

అతని గుండెల్లో సన్నసన్నని సెగలు గుబులు పుట్టిస్తున్నాయ్. ఆమె ముగ్ధమనోహర రూపం ఆమని నవ్వులా సుతారంగా గుండెల్లో వేణువు వూదినా, ఆమె ఆలోచనలు గ్రీష్మగాలుల్లా మనసుని ప్రశ్నిస్తూ జీవితంలోకి ఆహ్వానించడానికి భయాన్ని కలిగిస్తుంటాయ్!

• ఉదయం వారపత్రిక, 8, మార్చి 1991 •